# తాగుడు కథ

రామానుజం చేతిలోని కాగితం చదివి ఆనందం పట్టలేక కెవ్వున కేక వేశాడు.

"ఏమిట్రా? ఎవరయినా పోయారా?" జాలిగా అడిగాడు రామ్మూర్తి.

"ఛట్-అదికాదురా! రేడియోలో నన్ను కథ చదవమని కంట్రాక్ట్ పంపించేరు." గర్వంగా అన్నాడు రామానుజం.

"ఓర్ని—నీ ప్రతిభ రేడియోస్టేషన్ వరకూ పాకిందన్నమాట..." ఆశ్చర్యంగా అడిగాడు చంద్రం.

మరుక్షణంలో రామానుజం రేడియోలో కథ తనే స్వయంగా చదవబోతున్నాడన్న వార్త ఆఫీసంతా కొత్తగా వచ్చిన జీవోలా వ్యాపించిపోయింది. చాలామంది రామానుజం సీటుదగ్గిర గుమికూడి పోయేరు.

"బ్రాడ్‌కాస్టింగ్ ఎప్పుడు?" అడిగింది టైపిస్ట్ సుమతి.

"వచ్చేనెల అయిదో తారీఖు...." పొంగిపోతూ అన్నాడు రామానుజం.

"అంటే ఆ రోజే మీరు రేడియో స్టేషన్లో చదువుతారా?" అడిగాడు సుదర్శనం.

"అబ్బే—అంతకు పదిరోజుల ముందు రికార్డింగ్ చేస్తారు. తరువాత అదే బ్రాడ్‌కాస్ట్ అవుతుంది...."

తనకు తెలిసిన విషయాలూ, మిగతా వారికి తెలీని విషయాలూ అన్నీ కలిపి యమ ఫోజులో లెక్చరిచ్చేస్తున్నాడు రామానుజం.

అందరూ అతను చెప్పే విషయాలు విని హోరున ఆశ్చర్యపోతున్నారు.

"ఇప్పుడు నేను రాయాల్సిన కథేమిటో తెలుసా? తాగుడువల్ల కలిగే నష్టాలు కష్టాలు గురించి అల్లాలన్నమాట! అలా అని అది వ్యాసంలా ఉండకూడదు. మాంచి ఇంటరెస్ట్ కలిగించాలి వినే వారికి. అఫ్‌కోర్సు అదేమంత కష్టం కాదనుకో! నూటయాభయ్ కథలు వ్రాసిన వాడిని. కాబట్టి ఇట్టే రాసేయగలను ..."

"నీవి ఎనిమిదేగా పత్రికల్లో ప్రచురింపబడింది?" అనుమానంగా అడిగాడు రామ్మూర్తి.

"కాదని ఎవరన్నారు? అంతమాత్రాన రాసినవి నూటయాభయ్ కాకూడదని ఎక్కడయినా ఉందేమిటి?"

"ఒరేయ్ మమ్మల్నిద్దరినీ ఆ కథ చదివే రోజున నీతోపాటు రేడియో స్టేషన్‌కి తీసుకెళ్ళరా! మేమెప్పుడూ రికార్డింగ్ ఎలాచేస్తారో చూడలేదు...." బ్రతిమాలుతూ అన్నారు రామ్మూర్తీ, సుదర్శనం.

యర్రంశెట్టి శాయి

రామానుజం కొద్దిక్షణాలు ఆలోచించి "ఆల్ రైట్" అనేశాడు.

వాళ్ళిద్దరూ దేవుడు వరమిచ్చినంతగా పొంగిపోయారు ఆ జవాబు విని.

అసలు ఆఫీసులో ఆ ముగ్గురిదీ ఓ జట్టు. ఉదయం ఆఫీస్ కొచ్చేప్పుడూ, మధ్యాహ్నం లంచ్ కెళ్ళేప్పుడూ, సాయంత్రం ఆఫీస్ ముగిశాక ఎప్పుడు చూసినా ఆ ముగ్గురూ కలిసే కనిపించే వాళ్ళు అందరికీనూ.

ఆ రోజునుంచీ తాగుడువల్ల కలిగే హానిగురించి కథ తయారుచెయ్యడం మొదలు పెట్టాడు రామానుజం. తాగుడు వల్ల ఎన్నిరకాల నష్టాలు జరుగుతోంది ముగ్గురూకలపి ఎన్నో వివరాలు సేకరించారు. వాటన్నిటినీ రామానుజం తన డయిరీలో రాసుకొన్నాడు.

చివరకు కథ పూర్తయింది.

రికార్డింగ్ రోజున ఉదయం రమ్మన్న సమయానికి ఓ గంటముందే రేడియో స్టేషన్ చేరుకొన్నారు ముగ్గురూ. వాళ్ళిద్దరినీ బయట చెట్లకింద నిలబెట్టి, తను లోపలి కెళ్ళి ఆ సెక్షన్ ఇన్‌ఛార్జికి తన కథ అందించాడు రామానుజం.

కథ చదివి "చాలా బాగా రాశాడు. తాగుడు వల్ల జరిగే కొన్ని దారుణాలు చాలా నేచురల్‌గా వర్ణించారు...." అని మెచ్చుకొన్నా డాయన. రామానుజం మరింత పొంగిపోయాడు.

రికార్డింగ్ పూర్తయింది రామానుజం టేబుల్ ముందు కూర్చుని మైకులో కథ చదవడం అది ఎదురుగ్గా ఉన్న గదిలో రికార్డవటం ఆనందంతో గమనించారతని మిత్రులు.

బయటికొచ్చేముందు డ్యూటీ ఆఫీసర్ రామానుజానికి ముప్ఫయ్ రూపాయలు చెక్కు కూడా అందించేడు. ఇది మరీ గర్వ కారణమయింది రామానుజానికి. అతను రాసిన నూటయాభయ్ కథలకూ ఎనిమిదే ప్రచురింపబడినాయ్. ఆ ఎనిమిది లోనూ రెండింటికే పారితోషికం లభించింది. మిగతా ఆరింటికోసం ఎన్ని ఉత్తరాలు రాసినా, టెలిగ్రామ్ లిచ్చినా ఏమాత్రం ఉపయోగం లేకపోయింది.

ముగ్గురూ బయటికొచ్చేరు.

రేడియో స్టేషన్ దగ్గర్లోనేవున్న బాంకులో చెక్కుమార్చి డబ్బు తీసుకొన్నాడు రామానుజం.

"ఒరేయ్ ఈ డబ్బుతో మాకు పార్టీ ఇవ్వవుట్రా?" అడిగారు రామ్మూర్తీ, సుదర్శనం

"పార్టీకోసం కాకపోతే నాకెందుకురా ఇది! జీతంలో ఎలాగూ పార్టీలు చేసుకోలేము. దీంతోనయినా కానిద్దాం...." అన్నాడు రామానుజం.

ముగ్గురూ వెంటనే బాంకు పక్కనే ఉన్న బార్‌లోకి నడిచి విస్కీ తాగేసి ఇళ్ళ కెళ్ళి స్పృహలేకుండా పడిపోయారు. □